క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పెద్దపప్పూరు: ధర్మాపురం గ్రామంలో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిదులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

ఆలయ నిర్మాణం ప్రారంభం

గుంతకల్లు రూరల్: కసాపురం గ్రామంలో టీపీఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో రాతి శిలల నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా తమిళనాడు నుంచి తెప్పించిన రాతి శిలలకు తలారి పరశురాముడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈకేవైసీ చేయించుకోండి

శింగనమల: పీఎం కిసాన్‌కు సంబంధించి ఇంత వరకూ ఈకేవైసీ చేయించుకోని రైతులు ఈనెల 15లోపు చేయించుకోవాలని ఏఓ చిన్నమ్మ సూచించారు. మండల వ్యాప్తంగా 10,421 మంది ఉండగా 8,275 మంది మాత్రమే నమోదు చేయించుకున్నారన్నారు. రైతులు దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్, గ్రామ సచివాలయంలో ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. రబీలో 1,138 ఎకరాల్లో పంట నమోదు చేశామని, పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



అమ్మవారి ప్రాకారోత్సవ దృశ్యం

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం శివ ముక్కోటి, ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. కన్యకా పరమేశ్వరిని అలంకరించి పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రాకారోత్సవం గావించారు. మంగళహారతి అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. వందేళ్లకోసారి పున్నమి, ఆరుద్ర నక్షత్రం రెండూ వస్తాయని, ఆరుద్ర నక్షత్రం శివుని జన్మ నక్షత్రం కావడంతో శివ ముక్కోటిగా ఆచరిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

కిసాన్ క్రెడిట్ కార్డులు సద్వినియోగం చేసుకోండి

యల్లనూరు: ప్రధాన మంత్రి కిసాన్ క్రెడిట్ కార్డులను మండలంలోని రైతులు ఎరువుల వాడకం కోసం సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం సొసైటీ సీఈఓ వీరనారప్ప, అధ్యక్షుడు కిరణ్ సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు రూ.20 వేల రుణంతో ఎరువులను కొనుగోలు చేసే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. రుణాన్ని సకాలంలో చెల్లిస్తే ఈ క్రెడిట్ కార్డు ద్వారా రూ.3 లక్షల వరకు అప్పుగా రైతులు ఎరువులు తీసుకోవచ్చన్నారు.

సత్యనారాయణస్వామి వ్రతం



వ్రతం చేస్తున్న భక్తులు

తాడిపత్రి టౌన్: స్థానిక గాజుల క్రిష్ణప్పవీధిలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతం ఘనంగా జరిగింది. ముందుగా రమా సహిత సత్యనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలను జలాక్షీరాభిషేకం అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరించారు. మహిళలు వ్రతం నిర్వహించారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే కార్యక్రమం జరిగింది. పారిశ్రామిక వేత్తలు, పారిశ్రామీకరణ ఎక్కువగా ఉన్న ప్రాంతం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్ అన్నారు. గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావత్మ, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ అరవింద్, ఎంబీఏ హెచ్‌ఓడీ నాగ ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లం దొడ్డి విషయమై ఘర్షణ

పెద్దపప్పూరు: కల్లం దొడ్డి విషయమై వెంగంపేటలో జరిగిన ఘర్షణలో ఆరుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన సోదరులు బొమ్మన భాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రాజారెడ్డిలకు కల్లందొడ్డి ఉంది. ఇక్కడ ఉంటున్న చెత్తతో తమ ఇళ్ల వద్దకూ తరచూ విషపురుగులు వస్తున్నాయంటూ సమీపంలో నివాసముంటున్న ఆదినారాయణరెడ్డి, నారాయణరెడ్డి, ఆదిరెడ్డి, నాగిరెడ్డి, లక్ష్మయ్య తరచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలోనే శుక్రవారం కల్లం దొడ్డివద్ద ఉన్న చెత్తకు నిప్పు పెట్టారు. దీంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. కట్టెలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. భాస్కర్ రెడ్డిని అనంతపురం తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షేమాభివృద్ధే జగనన్న లక్ష్యం



గుత్తిలో పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి



కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

• ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుత్తి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా దూసుకుపోతోందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. అనంతరం గుత్తి మున్సిపాలిటీకి నూతనంగా మంజూరైన 105 పింఛన్లు, రూరల్‌కు మంజూరైన 252 పింఛన్లను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు ఎవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రభుత్వం, వైఎస్సార్ సీపీకి ప్రజలే మీడియా, ప్రజలే దేవుళ్లన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి మాటను కార్యరూపంలో పెట్టిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. హామీల్లో ఇప్పటి వరకు 98 శాతం నెరవేర్చారని గుర్తు చేశారు. గతంలో ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోను గాలికొదిలేశారన్నారు. సీఎం జగన్ 175కు 175 సీట్లు సాధించాలనే దృఢ సంకల్పంతో ఉన్నారన్నారు.

చెట్నేపల్లిలో చర్చికి కాంపౌండ్ వాల్ నిర్మించాలి

గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లిలో షారోన్ ప్రార్థనా మందిరానికి కాంపౌండ్ వాల్ నిర్మించాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి 1వ వార్డు కౌన్సిలర్ గద్దల రూతమ్మ, షారోన్ చర్చి నిర్వాహకులు సుందరరాజ్ ,మహిమ, నాగేంద్రబాబు తదితరులు వినతి పత్రం అందజేశారు. ప్రహరీ నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ విశాలాక్షి, వైస్ ఎంపీపీ తిరుపాలమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్లు పద్మలత, బిందె వరలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ యాదవ్, జిల్లా కార్యదర్శులు రాజ్‌కుమార్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు వాల్మీకి శివ, కేవీ రమణ, వెంకట సుబ్బయ్య, వరదరాజులు, ఖాజా ఖాన్, నరేష్, నజీర్, సీనియర్ నాయకులు రామిరెడ్డి, ఈరన్న, జేమ్స్, జాన్ సునీల్, మున్సిపల్ కమిషనర్ మల్లెల లక్ష్మిదేవి, ఈఓఆర్డీ శివాజీ పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండల వ్యాప్తంగా కొత్తగా మంజూరైన 211 మందికి శుక్రవారం ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలోజెడ్పీటీసీ సభ్యురాలు, రమాదేవి, ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు అందిస్తుందన్నారు. జనవరికి సంబంధించి 4,218 మందికి రూ.1.21 కోట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు.



పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎంపీపీ రామూర్తి రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి

సందడిగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి

గుంతకల్లుటౌన్: జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా మున్సిపల్ కౌన్సిల్ సహకారంతో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముత్యాల ముగ్గుల పోటీలు సందడిగా సాగాయి. శుక్రవారం పట్టణంలోని 26,9,19,14,31,6 వార్డుల్లో పోటీలను నిర్వహించారు. పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్‌లు నైరుతీరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజూ 6 వార్డుల్లో పోటీలు నిర్వహించనున్నామని, ఒక్కో వార్డులో మంచి ముగ్గులు వేసిన మొదటి ముగ్గురిని ఎంపిక చేస్తామని, 13న 37 వార్డుల్లోని 111 మందికి ఫైనల్ పోటీలను నిర్వహిస్తామన్నారు. విజేతలకు గృహోపకరణాలు(ఫ్రిడ్జ్, ఎల్ఈడీ టీవీ, మిక్సర్ గ్రైండర్)లను అందజేయనున్నట్లు వారు తెలియజేశారు. ఫైనల్‌కు చేరిన మహిళలకు రూ.500 విలువైన బహుమతులను అందజేస్తామన్నారు. మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, కౌన్సిలర్లు దర్గాచెన్నమ్మ, రవీంద్ర, మాణిక్యం, సాయిపోగు రంగమ్మ, నాగరత్నమ్మ, నీలావతి, మెప్మా సీఓలు మధు, మనోప్రియ, సుశీల, వనజాక్షి, అంజనాదేవి, రామాంజినేయులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకరనాయక్

గుత్తి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు– నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం సేవాగఢ్ గిరిజన గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి, వసతి గదులు అపరిశుభ్రంగా ఉండటంతో గురుకుల సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు కోరుకున్న విధంగా విద్యతో పాటుగా రుచికరమైన భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. గురకుల విద్యార్థులు చదువులో బాగా రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. తహసీల్దార్ మహబూబ్ బాషా, సీఐ వెంకట్రామిరెడ్డి, ఎంఈఓ రవినాయక్, జీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు అశ్వత్థమనాయక్, రాజునాయక్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న షెడ్డు కూల్చివేత



షెడ్డును కూల్చిన దృశ్యం

నార్పల: స్థానిక చితవనం కొట్టాల వద్ద నిర్మిస్తున్న ఓ షెడ్డును శుక్రవారం పంచాయతీ అధికారులు కూల్చివేశారు. ప్రభుత్వ భూమిలో తప్పుడు సర్వే నంబర్ వేసి దొంగ రిజిష్టర్ చేయించి ఓ వ్యక్తి గతంలో అమ్మకాలు జరిపారని, దీంతో షెడ్డు తొలగించామని పంచాయతీ అధికారులు తెలిపారు. అయితే బాధితుడు జావేద్ మాట్లాడుతూ 2017లో మొరుసు సంజీవ రెడ్డి నుంచి సర్వే నంబర్ 144–2లోని దాదాపు అర్ధ సెంటు భూమిని కొనుగోలు చేసి రిజిష్టర్ చేయించుకున్నామన్నారు. తాము కొనుగోలు చేసిన స్థలంలోనే షెడ్డు నిర్మిస్తున్నామని, కనీసం నోటీసులు జారీ చేయకుండా షెడ్డు కూల్చడం బాధాకరమన్నారు. తాము షెడ్డు నిర్మించే స్థలం ప్రభుత్వానిదైతే చట్టరీత్యా అధికారులు తీసుకునే చర్యలకు సిద్ధంగా ఉన్నామన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

పెద్దవడుగూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్, శ్రీ సరస్వతి హై స్కూల్లో శుక్రవారం బాల్య వివాహాల నిర్మూలనపై ఆర్డీటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏటీఎల్ నారాయణ, కల్చరల్ ఆర్గనైజర్ తెప్పయ్య బాల్య వివాహాలతో కలిగే నష్టాలను వివరించారు. ఎవరైనా చిన్న పిల్లలకు పెళ్లి చేస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

చిన్న వయస్సులోనే పెళ్ళి చేయడం వలన రక్తహీనత ఏర్పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కుటుంబాలకు కలిగే నష్టాలను గుర్తుపెట్టుకొని బాల్య వివాహాలు చేయడం మానేయాలని పిలుపు నిచ్చారు. బాలికలను చదివించాలని సూచించారు.

విచారణ అధికారి నియామకం

అనంతపురం సప్తగిరి సర్కిల్: శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉద్యోగి సుదర్శన్‌పై విచారణ చేపట్టేందుకు విచారణ అధికారిగా పామిడి సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎల్లప్పను నియమించినట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణవేణి శుక్రవారం తెలిపారు. ఉద్యోగి విధుల్లో నిర్లక్ష్యం, ఇతర ఫిర్యాదులపై శనివారం విచారణ చేపట్టనున్నట్లు డీసీహెచ్‌ఎస్ తెలిపారు.

బుగ్గ రామలింగేశ్వరుడికి అన్నాభిషేకం

తాడిపత్రి టౌన్: స్థానిక శివాలయం వీధిలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అన్నాభిషేకం నిర్వహించారు. పుష్యమాసం పౌర్ణమి పురస్కరించుకుని ఆరుద్ర నక్షత్రం రోజున శివ ముక్కోటి కార్యక్రమంలో భాగంగా అర్చకులు ఉత్తర ద్వార దర్శనం, మృత్యుంజయ హోమాన్ని చేపట్టారు.

నేడు గుండె వైద్య శిబిరం

తాడిపత్రి టౌన్ : స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు షాకీర్ తెలిపారు.

పోలీసుల సోదాలు

తాడిపత్రి : మండలంలోని బోడాయిపల్లిలో శుక్రవారం రూరల్ సీఐ చిన్న పెద్దయ్య సిబ్బందితో కలసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని పాత నేరస్తులు, అనుమానిత వ్యక్తుల ఇళ్లలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు.

నేడు విద్యుత్ అంతరాయం

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ, గుత్తి మండలం, పెద్దవడుగూరులలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కుమార్ తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గుత్తి 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించండి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సర్పంచు సంజీవరాయుడు

యాడికి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తూట్రాళ్లపల్లె సర్పంచు సంజీవ రాయుడు నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం ఆయన గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని నిర్వాకులకు సూచించారు. హెచ్ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

వైద్య పరీక్షలు

యాడికి: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కత్తిమానుపల్లెలో 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు యాడికి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ



విద్యార్థినులతో పాటు భోజనం చేస్తున్న శ్రీరామిరెడ్డి

శింగనమల: స్థానిక కస్తూర్బా పాఠశాలను డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థినులతో భోజనం తిన్నారు. కొత్తగా వచ్చిన సిబ్బంది భోజనం ఎలా పెడుతున్నారని, మజ్జిగ ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని వారికి సూచించారు. పాఠశాలలో సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. నాడు–నేడు కింద నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. మండల కో–ఆప్షన్ మెంబర్ బంగారు ఆలీ, వైఎస్సార్‌సీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగరాజు ఉన్నారు.

కమనీయం.. నారాయణుడి కల్యాణం



ఉత్సవమూర్తులను పలకీలో ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: పవిత్ర పుణ్యక్షేత్రమైన అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్రంలో శుక్రవారం నారాయణుడి కల్యాణం కమనీయంగా సాగింది. ముందుగా క్షేత్రంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత నారాయణస్వామి ఉత్సవమూర్తులను అర్చకులు బాలసుబ్రమణ్య శర్మ, సుధీర్‌కుమార్ శర్మ, సునీల్‌కుమార్ శర్మలు పట్టువస్త్రాలతో అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. వేడుకను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యంలు తీర్థప్రసాదాలతో పాటు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

• ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుంతకల్లు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. కసాపురం గ్రామంలో శుక్రవారం మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి గడప గడపకూ తిరుగుతూ ప్రభుత్వ లబ్ధిని తెలియజేయడంతోపాటు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు చిన్న చిన్న సమస్యలు సైతం పరిష్కారం కాక అధికారులు, పాలకుల చుట్టూ తిరిగి విసిగిపోయేవారన్నారు. ప్రస్తుతం ఆ కష్టాలు లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చారన్నారు. ప్రజలు వారి ఇంటి గడప కూడా దాటకుండానే సంక్షేమ పథకాలను సైతం నేరుగా మీ ఇంటివద్దకే చేరుస్తున్నారని గుర్తు చేశారు. వీటన్నింటినీ ప్రజలు దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. బూటకపు హామీలతో పబ్బం గడుపుకునే చంద్రబాబు మరోసారి తన మాయమాటలతో మోసం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. ఓటు వేసేముందు ప్రతి ఒక్కరూ ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. ఇచ్చిన ప్రతి హామీని, చెప్పిన ప్రతి మాటను నెరవేరుస్తూ అహర్నిశలూ ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఎంపీడీఓ జాషువా, తహసీల్దార్ రాము, ఎంపీపీ బీవీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప, వైస్ ఎంపీపీ ప్రభావతి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవేంద్రప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రావు, సర్పంచ్ రాయల్ అనిత, ఎంపీటీసీ జ్యోతి, మాజీ ఎంపీటీసీ వెంకటరాముడు, సీనియర్ నాయకుడు వెంకటరెడ్డి, గంతుల రామాంజనేయులు, పవన్ ఆంజనేయులు, బాలాంజనేయులు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, రాయల్ సుధాకర్, బెస్త మనోహర్, రామంజనేయులు, వినోద్ కుమార్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పదేళ్ల నాటి సమస్య ఒక్క రోజులో పరిష్కారం



పట్టాలు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే వైవీఆర్, ఇతర నాయకులు

గుంతకల్లు రూరల్: కసాపురంలో పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఇంటి స్థలాల సమస్యను ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఒక్కరోజులో పరిష్కరించారు. వివరాల్లోకెళితే.. పదేళ్ల క్రితం గ్రామంలోని ఎస్సీ కాలనీలో 24 మంది ఇళ్లులేని నిరుపేదలను గుర్తించిన అప్పటి ప్రభుత్వం వారికి ఇళ్ల పట్టాలను మంజూరు చేసినా ఇళ్ల స్థలాలను చూపించలేదు. దీంతో లబ్ధిదారులు పదేళ్లుగా అధికారులు, పాలకుల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయారు. ఈ క్రమంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈనెల 5న పర్యటించిన ఎమ్మెల్యేతో బాధితులు సమస్యను తెలియజేశారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి మరుసటి రోజుకంతా ఇళ్ల పట్టాలతో పాటు ఇళ్ల స్థలాలు చూపించాలని ఆదేశించారు. తహసీల్దార్ రాము తన సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించి సర్వే నంబర్ 121 ఎఫ్1లో ఇళ్ల స్థలాల పంపిణీకి స్థలం అనువుగా ఉండటంతో రాత్రికి రాత్రి లేఅవుట్ తో పాటు, పట్టాలను సిద్ధం చేశారు. శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే చేతుల మీదుగా గ్రామ సచివాలయంలో 24 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పదేళ్ల సమస్యను ఒక్కరోజులోనే పరిష్కరించిన ఎమ్మెల్యే పనితీరుపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. లబ్ధిదారులు పూలమాలలు శాలువాలతో ఎమ్మెల్యేను సత్కరించడంతోపాటు కృతజ్ఞతలు తెలియజేశారు.

10న మిశ్రమ బియ్యం వేలం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన మిశ్రమ బియ్యాన్ని ఈ నెల 10న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వేల్పుల సోమశేఖర్ యాదవ్, ఈఓ దేవదాసు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలకు వేలం ఉంటుందని, రూ.వెయ్యి చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు. వివరాలకు ఆలయంలో సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

గార్లదిన్నె: కనంపల్లి గ్రామ సచివాలయంలో అధికారులు శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. వ్యవసాయ సిబ్బంది పంటల సాగు ప్రణాళికలు, సస్యరక్షణ, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. అనంతరం ఎంపీడీఓ విజయ భాస్కర్, సిబ్బంది ఇల్లూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద సాగు చేసిన పండ్లతోటలను పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పౌర్ణమి పూజలు



పెద్దమ్మతల్లికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

యాడికి: స్థానిక వైశ్యవీధిలోని పెద్దమ్మ తల్లికి శుక్రవారం పెద్దమ్మ తల్లి మహిళా మండలి ఆధ్వర్యంలో ధనుర్మాస పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, లలిత సహస్రనామార్చన, కుంకుమార్చన, ధూప దీపనైవేద్యాలతో అమ్మవారికి పూజ చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆరవైశ్య సంఘం అధ్యక్షుడు గాధంశెట్టి బలరామయ్య, ఆదిత్యపవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

పామిడి: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం 11 గంటలకు కొత్త పింఛన్‌దారులకు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి పింఛన్ సొమ్ము పంపిణీ చేయనున్నారు. లబ్ధిదారులతోపాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

నేడు ఎస్సీల ఆత్మీయ సమ్మేళనం

గార్లదిన్నె: జిల్లా కేంద్రంలో శనివారం ఎస్సీల ఆత్మీయ సమ్మేళనం ఎస్సీ,ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుళ్లాయప్ప శుక్రవారం తెలిపారు అనంతపురంలోని ఆర్ అం డ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా, కుల, ఉద్యోగ సంఘాల్లో ఉన్న ఎస్సీలంతా తప్పక హాజరుకావాలని కోరారు.

ప్రజల హక్కులు కాలరాయొద్దు

గుంతకల్లుటౌన్: పోలీసు అనుమతి లేకుండా రోడ్లపై సభలు, రోడ్‌షోలు, ర్యాలీలు నిర్వహించరాదని ప్రభుత్వం జారీ చేసి జీఓ 1ని వెంటనే రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ శుక్రవారం పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో నిరసన తెలిపారు. నాయకులు శ్రీరాములు, సత్తార్, తరుణ్, భీమా, రఘునాథరెడ్డి, గోపి, రామాంజి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

తాడిపత్రి టౌన్: బొందలదిన్నె, దిగువపల్లి, కొనగుంటపల్లి గ్రామాల్లో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. గ్లోబల్ ఆర్గనైజేషన్ సభ్యుడు సోనాలిసింగ్, ఏఓ ప్రవీణ్, సర్పంచ్ వెంకట్రామిరెడ్డి ప్రకృతి వ్యవసాయంతో కలిగే ఉపయోగాలను వివరించారు. అనంతరం సేంద్రియ పద్ధతులతో సాగు చేసిన వేరుశనగ, శనగ పంటలను పరిశీలించారు. వ్యవసాయాధికారులు మాధవి, రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.